ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర – విశాఖ : విశాఖపట్నం ఆటో అండ్ మోటార్ వాహన డ్రైవర్లకు పీఎఫ్, ఈ ఎస్ ఐ, పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ రహిమాన్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు సిహెచ్. కాసుబాబు, పడాల గోవింద డిమాండ్ చేశారు. ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం జీవీఎంసీ గాంధీ పార్క్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది ఆటో, మోటార్ వాహన డ్రైవర్లు వేలాది రూపాయలు అప్పు చేసి ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు, కారులను కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంవత్సరానికి పన్నుల రూపంలో వేలాది రూపాయలు చెల్లిస్తు న్నప్పటికీ, వారికి భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. జీవో నెంబర్ 21, 31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో డ్రైవర్ మరణిస్తే రూ.10లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇన్సూరెన్స్ పాలసీని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఆఫీస్ డి.ఆర్.ఓ సత్యనారాయణకి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.సింహాద్రి, ఈగల వలస అప్పలరాజు, అడ్డూరి శంకర్రావు, లోకేష్, గణేష్, వెంకట్రావు, నాగు తదితరులు పాల్గొన్నారు.

బృందావనంలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర – పాయకరావుపేట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబునాయుడు అరెస్టుకు నిరసనగా నాయకులు పట్టణంలోని బృందావనం కాలనీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీ విశ్వనాద్, పల్లా విలియం కేరి, లెక్కల గోవిందు, జూరెడ్డి ప్రసాద్, మలిపెద్ది వెంకటరమణ, గుల్లా నాగరాజు, వేములపూడి అప్పారావు, పెదిరెడ్డి నాగ వెంకట రమణ, కట్టా శ్రీను, చిరుకూరి పేర్రాజు, రాజాన ఆది, పిన్నింటి సూరిబాబు, ఏడిద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

20న చింతపల్లిలో స్పందన

విశాలాంధ్ర బ్యూరో – పాడేరు: చింతపల్లిలో ఈనెల 20వ తేదీ శుక్రవారం జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు. చింతపల్లిలో స్పందన ఉన్నందున పాడేరులో స్పందన రద్దు చేయడం జరిగిందని, ప్రజలు గమనించి పాడేరులో స్పందనకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఘనంగా శరన్నవరాత్రులు

విశాలాంధ్ర – మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం అల్లరి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రుల మహోత్సవంలో భాగంగా బుధవారం అమ్మవారిని పలువురు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వార్డు అధ్యక్షులు మజ్జి సోమేష్, వార్డు మహిళా అధ్యక్షురాలు సర్వ సిద్ది శ్రీ లక్ష్మి, టీడీపీ జిల్లా సెక్రటరీ కాకి పోలీరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు చింతలపూడి సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రెస్ అకాడమీ చైర్మన్

విశాలాంధ్ర – సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారిని ఆంధ్రప్రదేశ్ సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఏఈఓ భ్రమరాంబ, పర్యవేక్షకులు బరువు శ్రీనివాస్ స్వాగతం పలికారు. తొలుత కప్పస్తంభం ఆలింగనము చేసుకుని, బేడా మండపం ప్రదక్షిణ చేశారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఏడిద వీర వెంకట సత్య సూర్య భ్రమరాంబ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జగనన్నకు చెబుదాంలో వినతుల వెల్లువ

విశాలాంధ్ర – పెందుర్తి : పెందుర్తి మండలానికి సంబం ధించి జిల్లా మహిళా సమైక్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయి శ్రీకాంత్ పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఎంపీపీ ఎం.నాగమణి జుత్తాడ, అక్కిరెడ్డి పాలెంలో గల జగనన్న కాలనీలో సమస్యలను తెలియజేసి, పరిష్కరించాలని కోరారు. అలాగే పలువురు సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కాలేదని, సబ్ రిజిస్టర్ ఆఫీస్ నుంచి పంచాయ తీలకు రావాల్సిన నిధులు కూడా రావడం లేదని ఫిర్యాదు చేసారు. పెందుర్తిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని, ముస్లింలకు షాదీ ఖానా మంజూరు చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి షేక షఫీఉల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్, ఏసీపి, రెవెన్యూ జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై అప్రమత్తంగా ఉండాలి
మేయర్ హరి వెంకట కుమారి

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: వాతావరణం మార్పు, విపత్తుల నివారణపై జీవీఎంసీ ప్రత్యేక దృష్టి సారించిందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె వాతావరణ మార్పు, విపత్తుల నివారణపై ఫోర్ పాయింట్ హోటల్లో జీవీఎంసీ, ఎస్ఆర్‌యు సంయుక్తంగా నిర్వహించిన టీ – క్యాప్ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ సువిశాలమైన విశాఖ నగరానికి సముద్ర తీర ప్రాంతం, ఎన్నో ఫ్యాక్టరీలు ఉన్నాయని తెలిపారు. విశాఖలో 35% పచ్చదనం ఉందని, దీనిని ఇంకా పెంచేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. వాతావరణం మార్పుల కొరకు ప్రభుత్వ కార్యాలయాలు, రిజర్వాయర్ల పైన సోలార్ సిస్టం ఏర్పాటుతోపాటు విద్యుత్ వాహనాల వినియోగం పచ్చదనంపై దృష్టి సారించామని తెలిపారు.

కార్మికులకు రూ.60 వేల బోనస్‌ను ప్రకటించాలి

విశాలాంధ్ర – కూర్మన్నపాలెం: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్లో పనిచేస్తున్న ఉక్కు కార్మికులకు దసరాకు ఇచ్చే ఎక్స్ గ్రేషియా బోనస్‌ను తక్షణమే 60,000 తగ్గకుండా లేదా సెయిల్‌తో సమానంగా ఉండేలా జమ చేయాలని విశాఖ స్టీల్ ఎంప్లాయిస్ కాంగ్రెస్ ఐఎన్‌టీయూసీ మిత్ర పక్షాలు నీరుకొండ రామచంద్రరావు అధ్యక్షతన మహాధర్నా బుధవారం నిర్వహించారు. ఉక్కు కార్మికులకు గతేడాది బకాయి ఉన్న బోనస్ 9500 కూడా ఈ ఏడాది బోనస్‌తో కలిపి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంటక్ వర్కింగ్ ప్రెసిడెంట్ కారు రమణ, రాజు, కోవిరి అవతారం, నాయుడు, నాయక్, ప్రభాకర్ రెడ్డి, పీవీ రమణ మూర్తి, సుబ్బయ్య, డి.మోహన్, కొమ్ము ప్రసాద్, సుదర్శనం, కరణం సత్యారావు, బొడ్డు రమణ, ప్రగడ వేణు బాబు, మంత్రి గోపి నారాయణ, పోలీస్ నాయుడు, మధు, బంటు రాము, ఆదారి లోకేష్ పాల్గొన్నారు.

రావాడలో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర – పరవాడ: రావాడ పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని బొట్టవానిపాలెం, మోటూరువానిపాలెం, ఇందిరమ్మ కాలనీ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ఏ విధంగా చేరుతున్నాయనేది లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, ఎంపీడీఓ హేమ సుందరరావు, ఈఓఆర్డీ రమేష్ నాయుడు, పీఆర్ ఏఈ గండి రామారావు, హౌసింగ్ ఏఈ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ, ఏపీఈపీడీసీఎల్ ఏఈ శేష సాయి, ఏపీఎం కనకమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి ఆశయ సాధనకు కృషి: గంధం సునీత

విశాలాంధ్ర – కశింకోట: తండ్రి స్వర్గీయ గంధం నందగోపాల్ ఆశయ సాధనకు కృషి చేస్తానని కుమార్తె గంధం సునీత అన్నారు. నరసింగబిల్లులో గల ప్రముఖ పారిశ్రామిక వేత్త గంధం నందగోపాల్ 6వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమార్తె గంధం లక్ష్మి సునీత, నర్సింగపల్లి ప్రజలు మిత్రులు శ్రేయోభిలాషులతో కలసి తన తండ్రికి ఘన నివాళులర్పించారు. సునీత ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసిపి నాయకులు, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన చేతుల మీదుగా సునీత, గిరిధర్‌లు పేదలకు బట్టలు పంపిణ, మరికొంత మందికి వారి కుటుంబ ఆర్థిక అభివృద్ధి కోసం కుటుంబానికి రెండు లక్షల రూపాయల చెక్కు చొప్పున మూడు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ప్రముఖ వ్యాపారవేత్త నందగోపాల్ ఇక్కడ ప్రాంత వాసులకే కాదు రాష్ట్రంలోనే ఒక చక్కటి పేరు గల మంచి మనిషి అన్నారు. అలాంటి వ్యక్తి కూతురుగా సునీత తన తండ్రి అడుగుజాడల్లో ఆయన నేర్పిన మంచి బాటలో పయనిస్తూ తండ్రికి తగ్గ తనయగా పేరు పొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ముక్క శ్రీనివాసరావు, ఆల్ఫ్ కృష్ణ, పొనంగి గిరిధర్, కొణతాల హరినాథ్ పాల్గొన్నారు.

యువత విలువలు పాటిస్తే ఉజ్వల భవిత

విశాలాంధ్ర – మధురవాడ: యువతరం విలువలు పాటిస్తూ ఉన్నతమైన వక్తిత్వంతో ఆదర్శంగా నిలవాలని తద్వారా ఉజ్వల భవిష్యత్తు సాధ్యపడుతోందని అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ ప్రభు నిష్కించిన భక్తదాస సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బుధవారం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మనిషిలో రావణుడు వంటి రాక్షస ప్రవృత్తి ఉంటుందని అది జీవితంలో ఎదగకుండా అడ్డు పడుతుందని ఆ ప్రవృత్తిని సంహరించి విజయం సాధించడం దసరా పండుగ అంతరార్థం అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షంషుద్దీన్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టానికి తూట్లు పొడుస్తున్న గిరిజనేతరులు

విశాలాంధ్ర – ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో జీవనోపాధి కోసం వ్యాపార నిమిత్తం వచ్చి గిరిజన నాయకుల అండదండలతో గిరిజన ప్రాంతాల్లో 1/70, పీసా చట్టాలు అమలులో ఉన్నప్పటికీ చట్టాలను అతిక్రమించి కొందరు గిరిజనేతరులు తూట్లు పొడుస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండల కేంద్రంలో గల ఎంపీడీఓ క్వార్టర్స్ సమీపంలో రహదారికి ఆనుకొని షాపు వెనక వైపున వైశ్యరాజు మధుసూదనరావు(మధు) అనే గిరిజనేతరుడు 1/70, పీసా చట్టాలకు విరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండా దర్జాగా అక్రమ నిర్మాణం చేపడుతున్నాడు. ఎటువంటి రెవిన్యూ, పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం చేసిన ఈయనకు పంచాయతీ రెవెన్యూ అధికారులు తనిఖీలు చేసి అక్రమ నిర్మాణం కింద నోటీసు ఇవ్వాలి. కానీ మధుసూదన్‌రావు అనే గిరిజనేతరుడికి నోటీసులు ఇవ్వకుండానే నిర్మాణాన్ని నిలుపుదల చేసినట్లు చేసి వారితో చేతులు కలిపి రాత్రికి రాత్రే అక్రమ కట్టడాలకు అధికారులు అండదండగా ఉంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ తెలియనట్లు వ్యవహరించడం పట్ల గిరిజన సంఘాలు, రాజకీయ నాయకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గిరిజన హక్కులు, చట్టాలు అమలు చేయాల్సిన ప్రభుత్వ అధికారులే గిరిజనేతరుడికి కొమ్ము కాస్తే గిరిజన చట్టాల్ని రక్షించేది ఎవరని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనేతరుడు మధుసూదన్ రావు 1/70 చట్టానికి విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేయాలని లేనిపక్షంలో సంబంధిత కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

ఈ-చలానాలు రద్దు చేయాలి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల ధర్నా

విశాలాంధ్ర బ్యూరో – అనకాపల్లి: ఈ – చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై.ఎన్.భద్రం ఆధ్వర్యంలో ఆటో కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. భద్రం మాట్లాడుతూ ఆటో కార్మికుల పరిస్థితి దిన దిన గండం దీర్ఘాయుష్షుగా ఉందని ఉదయం లేచిన దగ్గర్నుంచి నిద్రించే వరకు ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి బ్రతుకు దుర్భరంగా మారితే, మరోవక్క డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగి తీవ్ర ఇక్కట్లు పడుతున్నార న్నారు. ప్రమాదంలో చనిపోయిన ఆటో కార్మికులకు 10 లక్షలు, సహజ మరణానికి ఐదు లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణ పేరుతో కేంద్ర ప్రభుత్వం 894, రాష్ట్ర ప్రభుత్వం 21, 31 జీవోలను తీసుకొచ్చి ఆటో, మోటార్ కార్మికులకు తెలియకుండానే జరిమానాలు విధించి దోచుకోవడం సిగ్గుచేటు అన్నారు. వాహన మిత్ర పేరుతో కొంతమందికి మాత్రమే 10000 రూపాయలు ఇచ్చి వారి దగ్గర నుంచి సంవత్సరానికి 60 నుండి 70 వేల రూపాయలు జరిమానాల రూపంలో వసూలు చేస్తే వాళ్లు ఆత్మహత్యలు చేసుకోవడంతప్ప మరొక గత్యంతరం లేదన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ జిల్లా కో కన్వీనర్ కోనలక్ష్మణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, ఏఐటీయూసీ నాయకులు శ్రీరామదాసు అబ్బులు, తాకాసి వెంకటేశ్వరరావు, కొరుబిల్లి శంకర్రావు, ఒమ్మి సైదులు, పెద్దింటి నాగేశ్వరరావు, శ్రీను, గంగాధర్, ప్రసాద్, ఒ.శ్రీను, కర్నం శ్రీను ఎస్.గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకి అందజేశారు.

దేవస్థానం వర్గాల్లో ఉత్కంఠ

విశాలాంధ్ర – సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం ఎట్టకేలకు ఈనెల 20వ తేదీన నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆరోజు ఉదయం 10.80 గంటల నుంచి కృష్ణాపురం గోశాల ఆవరణలో ఈ సమావేశం జరుగుతుందని ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సమావేశంలో చర్చించేందుకు చరిత్రలో ఎన్నడూ చూడని భారీగా 82 అంశాలతో కూడిన జంబో అజెండాను సిద్ధం చేసి ధర్మకర్తల మండలి సభ్యులకు పంపిణీ చేశారు. దేవాదాయ శాఖ చట్టం ప్రకారం ప్రతి రెండు నెలకోసారి జరగాల్సిన ఈ సమావేశం సింహాచలంలో ఈ ఏడాది మార్చిలో చివరిసారిగా నిర్వహించారు. ఛైర్మన్ అశోక్ గజపతిరాజు కూడా ఇదే విషయాన్ని ఇటీవల ప్రస్తావించిన నేపథ్యంలో ఈవో శ్రీనివాసమూర్తి చొరవ చూపి ఇందుకు మార్గం సుగమం చేశారు. అవకతవకలు జరిగాయని మాజీ ట్రస్టుబోర్డు సభ్యురాలు, తాజా ప్రత్యేక ఆహ్వానితురాలు ఒకరు దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు ఉన్నతాధికారులు విచా రణకు సైతం ఆదేశించారు. అయితే ఈ సమా వేశంలో 2023లో రూ.9 కోట్ల ఇంజినీరింగ్ పను లకు పూర్తి వివరాలు కావాలని సభ్యులు పట్టుబడు తున్నట్లు ప్రస్తుత పరిస్థితుల్లో జరగనున్న ట్రస్టుబోర్డు సమావేశంపై దేవస్థానం వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

7521 విద్యుత్ సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర – పాయకరావుపేట: 2004-05 ఏడాది నుండి ఇప్పటివరకు 7521 విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించినట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్ పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. పాయకరావుపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల నుండి పలు సమస్యలు స్వీకరించారు. మండలంలోని అరట్లకోట గ్రామంలోని ఎస్సీ కాలనీలో తన ఇంటిపై నుండి విద్యుత్ వైర్లు వెళ్తున్నాయని, తొలగించాలని విద్యుత్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని జిగటాల కుమారి ఫిర్యాదు చేశారు. విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ స్థంబాలకు డబ్బులు కట్టినా నేటికి విద్యుత్ సరఫరా అందించలేదని మరో మహిళ ఫిర్యాదు చేశారు. పలు ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 2004 -05 నుండి ఇప్పటి వరకు 7608 సమస్యలు రాగా అందులో 87మాత్రమే పరిష్కారం కాలేదన్నారు. ఈఏడాది జనవరి నుండి ఇప్పటి వరకు 359 సమస్యలు పరిష్కరించామన్నారు. సకాలంలో సమస్య పరిష్కారం కాని 101 కేసులకు విద్యుత్ శాఖ నుండి రూ.5.49లక్షలు వినియోగదారులకు నష్టపరిహారం చెల్లించినట్లు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సమస్యల పరిష్కార న్యాయస్థానం సభ్యులు వి.జనార్ధన రావు, పాయకరావుపేట ఏడి వై.వి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వినియోగించుకోండి

విశాలాంధ్ర – గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు గోపాలపట్నం జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో 478 సచివాలయానికి సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమి షనర్ సాయి కాంత్‌వర్మ, జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరో గ్యమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు జి.అప్పలస్వామి నాయుడు, బలిరెడ్డి శ్రీను, చెరుకూరి కుమార్, అప్పన్న, మనోహర్, సురేష్ పాల్గొన్నారు.

డుంబ్రిగూడ: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండలంలోని కించమండ గ్రామపంచాయతీలో గల బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో సుమారు 310 ఓపీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, వైసీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, వైద్యాధికారి రాంబాబు, వైసిపి మండల సీనియర్ నాయకులు సింహాచలం, శ్రీరాములు, హెల్త్ అసిస్టెంట్లు ఎం.సంజీవరావు, ఎస్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వి.మాడుగుల: మాడుగుల మండలం పొంగలిపాక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళపురెడ్డి రాజారావు, జెడ్పీటీసీ కిముడు రమణమ్మలు ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ కె.మాలెం నాయుడు, లీలాప్రసాద్, సంతోష్ కుమార్, అభినవ్ డాక్టర్ల వైద్య బృందం సుమారు 350 మందికి పలు సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మీనాకుమారి, సర్పంచ్ నాయన దేవుడమ్మ సత్యనారాయణ, ఎంపీ టీసీ మైచర్ల సన్యాసిరావు, ఉపసర్పంచ్ ఉండూరు భాస్కర్, గ్రామ శాఖ అధ్యక్షులు నాయన ధన, మాజీ ఎంపీటీసీ ఉండూరు దేముడు, కొర్ని మోదినాయుడు, యన్నంశెట్టి సన్యాసిరావు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు పనుల పరిశీలన

విశాలాంధ్ర – ముంచింగిపుట్టు: మండల పరిధిలో గల దుడుమ ఆర్ అండ్ బి రోడ్డు నుండి రాంపుట్టు వరకు రెండు కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ కిముడు వసంత, వైసిపి మండల పార్టీ ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో పరిశీలించారు. గ్రావెల్ రోడ్డు అనంతరం బిటి రోడ్డు కూడా వెంటనే మంజూరైందని ఆ పనులు కూడా వెంటనే మొదలు చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాకవరం సర్పంచ్ గంగాధరం, కరిముకుట్టు సూపర్ సర్పంచ్ అర్జున్, శివ వంతల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ రోడ్డు పనులకు ఎన్ఆర్ఈజీఎస్ స్కీం ద్వారా 50 లక్షలు మంజూరు చేసి ఉన్నారు.

జలాశయంలో చేప పిల్లలు విడుదల

విశాలాంధ్ర – కె.కోటపాడు: రైవాడ జలా శయంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 8.30 లక్షల చేప పిల్లలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు బుధవారం విడుదల చేశారు. మూడు అంగుళాల సైజు గల రాగండి, బొచ్చే, మోసు చేప పిల్లలను విడుదల చేయడం జరిగిందని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. అంతకుముందు రైవాడలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కె.కోటపాడు మండలం వారాడ గ్రామంలో ఏర్పాటుచేసిన ఆరోగ్య సురక్ష శిబిరం జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో కర్రి సత్యం, కిలపర్తి రాజేశ్వరి, బూరే బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనుల పరిశీలన

విశాలాంధ్ర – ఆనందపురం: మండలంలో రీ సర్వే పనులను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ పరిశీలించారు. రీ సర్వే జరుగుతున్న తీరును పరిశీలన చేసి తగు సూచనలు, సలహాలు సర్వేయర్లకు అందించారు. గండిగుండం, మామిడి లోవ, గుడిలోవలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియకు రైతులందరూ సహకరించాలని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని, అలాగే మామిడిలోవ గ్రామంలో సిగ్నల్ లేని ప్రాంతంలో ఆఫ్‌లైన్ మోడ్‌లో సర్వే చేయించి పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ, ఆర్డీవో భాస్కర్ రెడ్డి, తహశీల్దార్ లోకవరపు రామారావు, వైసీపీ నాయకులు బలిరెడ్డి మల్లికార్జున రావు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తికి నిలయంగా భీమిలి కేజీబీవీ పాఠశాల

విశాలాంధ్ర – భీమిలి: భీమిలి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల క్రీడా స్ఫూర్తికి నిలయంగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ గంగా కుమారి తెలిపారు. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం జిల్లా పరిషత్ పాఠశాలలో ఈనెల 16, 17 తేదీలలో జరిగిన అండర్ 14 సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భీమిలి కస్తూరిబా గాంధీ బాలికలు విన్నర్‌గా నిలిచి పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారని అన్నారు. బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఇదే పాఠశాలకు చెందిన బి.ప్రవల్లిక ఎంపిక కావడం మరొక విశేషమని అన్నారు. క్రీడల్లో పిఈటి వై.వరలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో పాఠ శాల ఉపాధ్యాయులు కూడా ఉన్నారు.

సజ్జలను కలిసిన వైసీపీ సీనియర్ నేత రఘునాథ్

విశాలాంధ్ర – అరకులోయ: అరకు నియోజకవర్గ సీనియర్ నాయకులు సమర్డి రఘునాథ్ గురువారం విజయవాడ తాడేపల్లి సెంట్రల్ ఆఫీస్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డితో భేటీ అయ్యారు. అరకు నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాలకు చెందిన పలు సమస్యలు, నియోజకవర్గ రాజకీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పార్టీ నుండి అరకు నియోజవర్గం భారీ మెజార్టీతో తమ పార్టీ విజయ దుందుభి మ్రోగుతుందని, అలాగే జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి వెళ్లి జగనన్న సురక్షపై అవగాహన పరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ టీం ఇండియా జాతీయ అధ్యక్షుడు నరప్ప రెడ్డి, సురేంద్ర, రాజ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచకర్లకు అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన పంచకర్ల రమేష్ బాబుకి జీవీఎంసీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, చోడవరం ఇన్‌చార్జి రాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పర్యాయాలు శాసనసభ్యులుగా పని చేసి సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న పంచకర్ల రమేష్ బాబు నియామకాన్ని జనసేన పార్టీ శ్రేణులు మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాయని అన్నారు.

20న విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర – భీమిలి: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు సూచనల మేరకు ఈనెల 20వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. శుక్రవారం నాడు ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 4:00 గంటల వరకు చిన్నబజార్, కీతింపేట, బ్యాంక్ కాలనీ, ఏళ్ళంపేట, మహాలక్ష్మి పురం, దేక్కటిపలెం, రజలింగంపేట, రేఖవనిపలెం, రయపలెం, మరదవలెం, మామిడిపాలెం, సైలెండర్ రెడ్డి అపార్ట్మెంట్, ములకుద్దు, ప్రాంతాలలో 11 కేవీ భీమిలి టౌన్ ఫీడర్ర్ మరియు క్.నగరపలెం, కాపులదిబ్బడిపలెం, సోమన్నపలెం, గోళ్ళలపలెం, మంగమరిపేట, రామాద్రి, ప్రాంతాలలో 11 కేవీ ఉప్పాడ ఫీదర్, లైన్ లను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించుట, ఇతర మరమ్మత్తుల నిమిత్తము విద్యుత్ నిలుపుదల చేయబడును.

రోడ్డు, డ్రైన్‌ల పనులు ప్రారంభం

విశాలాంధ్ర – భీమిలి: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు భీమిలీ జోన్ 1వ వార్డ్ లో స్థానిక రామ వీధిలో 1వ వార్డ్ కార్పొరేటర్ అక్కరమాని పద్మావతి రామునాయుడు అధ్వర్యంలో రోడ్ అండ్ డ్రైన్‌ల పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ తమ్మిన రాము, సీనియర్ నాయకులు అక్కరమాని చినబాబు, జిల్లా ఎక్జిక్యూటివ్ సభ్యులు పందిరి విజయ్ కుమార్, సీనియర్ కొప్పుల కృష్ణ, గిడుతురి పూర్ణా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా నివారణకు చర్యలు

విశాలాంధ్ర – హుకుంపేట : ఏజెన్సి ప్రాంతంలోని గంజాయి సారా విక్రయాలు రవాణ జరగకుండా పోలీసు శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పీ తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన హుకుంపేట పోలీసు స్టేషన్ సందర్శించి గతంలో పట్టుబడిన గంజాయి సారా నిల్వ చేసిన గదులు తనిఖీ చేసారు. పాత కేసులు నమోదు చేసిన సిడి ఫైల్ రికార్డులు సైతం పరిశీలించి అన్ని సజావుగా ఉన్నయని స్థానిక ఎస్ఐ సతీష్ సిబ్బందిని అభినందిరచారు. పోలీసు సిబ్బంది త్రినాద్, మోహన్ దాస్‌కు క్యాష్ రివార్డ్ అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దేవ రాజు, సిఐ సుధాకర్, ఎస్ఐ సతిస్ తదితరులు పాల్గొన్నారు.

మొండికండిలో సమగ్ర భూ రీసర్వే

విశాలాంధ్ర – నర్సీపట్నం: మండలంలోని వేములపూడి పంచాయతీ రెవెన్యూ పరిధిలోని మొండికండి గ్రామంలో బుధవారం నర్సీపట్నం మండల తహశీల్దార్ హెచ్ అన్నాజీ రావు పర్యవేక్షణలో మండల సర్వేయర్ టిడివి ప్రసాద్ సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో సాగు విస్తీర్ణం డేటా నిర్ధారణ చేపట్టారు. వేములపూడి రెవెన్యూ పరిధిలో 4300 ఎకరాలు భూ రీ సర్వే చేపట్టవలసి ఉండగా, ఇప్పటికే 800 ఎకరాలు రీ సర్వే పూర్తి చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, సర్వే సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైస్తవులు ఐకమత్యంతో జీవించాలి

విశాలాంధ్ర – హుకుంపేట: క్రైస్తవులు ఐకమత్యంతో జీవిస్తూ సమాజం కోసం ప్రార్ధనలు చేయాలని ఎమ్మెల్సీ కుంభ రవిబాబు పేర్కొన్నారు. మండలంలో గత్తుం పంచాయతీ కిముదుపుట్టు గ్రామంలో ప్రేయర్ పవర్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుడిరండి పండగా మహోత్సవాలకు ఎమ్మెల్సీ కుంభ రవిబాబు ముఖ్యతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఐకమత్యంగా కలసి ఉన్నది క్రైస్తవ సోదరులేనని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వం ప్రజల కోసం ముఖ్యంగా క్రైస్తవుల కోసం అనేక పథకాలు ప్రవేసపెట్టిందని వాటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కాసులమ్మ, మాజీ వైఎస్ ఎంపిపి రవిప్రసాద్, సర్పంచ్ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

22న జీ తెలుగులో 'దసరా కలిసుందాం రా' ప్రత్యేక కార్యక్రమం

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ప్రముఖ నటీనటులతో సంప్రదాయం, సంస్కృతి ఉట్టిపడేలా ఈ దసరా పండుగకి 'దసరా కలిసుందాం రా' అనే ప్రత్యేక కార్యక్రమంతో జీ తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు చెప్పారు. హృదయాలను హత్తుకునే క్షణాలు, మైమరపించే వినోదం నిండిన 'దసరా కలిసుందాం రా' అక్టోబర్ 22 ఆదివారం, సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారం కానుందన్నారు. మాస్ మహారాజ రవితేజ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమం ఆద్యంతం తెలుగు ప్రేక్షకులను అలరించనుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నటీ నటులతో రవితేజ, ప్రముఖ హీరో సుమన్ సరదా సంభాషణలు ఆద్యంతం అలరిస్తాయన్నారు.

స్కోడా ఆటోకి 250 కస్టమర్ టచ్ పాయింట్స్

విశాలాంధ్ర – విశాఖపట్నం: భారతదేశంలో ప్రీమియం కార్ల తయారీలో అగ్రగామి స్కోడా ఇండియా ఇప్పుడు తాజాగా తన ఉత్పత్తి వ్యూహాలను ప్రారంభించింది. ఇందుకోసం ఈ స్పెషల్ పండుగ సీజన్ ను ఉపయోగించుకుని ఆఫర్లను ప్రకటించింది. తద్వారా స్కోడా ఆటో ఇండియా తన నెట్వర్క్ ను భారతదేశం అంతటా 250 కస్టమర్ టచ్ పాయింట్ లకు విస్తరించే మైలురాయిని సాధించింది. కంపెనీ యొక్క డ్రైవింగ్ కార్లు అయినటువంటి – కుషాక్ ఎస్ యూ వీ, స్లావియా సెడాన్ భారతదేశంలో స్కోడా బ్రాండ్ను మరింతగా పెంచడంలో మరియు విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పెట్రో సాల్క్ తెలిపారు.

అమెజాన్ డాట్ ఇన్‌లో దసరా డిలైట్స్‌పై అద్భుతమైన డీల్స్

విశాలాంధ్ర – విశాఖ సిటీ: మనం పండుగ ఉత్సవాలు ప్రారంభించడంతో, పండుగ నిత్యావసరాలు, ఇండియన్ స్వీట్లు, స్నాక్స్, డ్రై ఫ్రూట్స్, హెూమ్ డెకోర్ కాస్మెటిక్స్, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ఫోన్లు, యాక్సెసరీస్, పెద్ద ఉపకరణాలు, ఫ్యాషన్, బ్యూటీ ఎసెన్షియల్స్ ఇలా ఎన్నో రకాల ఉత్పత్తులను అమెజాన్ డాట్ ఇన్ దసరా డిలైట్స్లో ప్రత్యేకంగా ఎంపికచేయబడిన ఉత్పత్తులను అందిస్తోంది. అమెజాన్ డాట్ ఇన్‌పై 'దసరా డిలైట్స్' ఈ పండుగ సీజన్లో వినియోగదారులకు విలువ ఆధారిత ఆఫర్లు, డీల్స్‌ను ఆస్వాదించడానికి వన్ స్టాప్ డెస్టినేషన్. ఇది విస్తృత శ్రేణి ఉత్పత్తులు మరియు ప్రసిద్ధ బ్రాండ్లకు ప్రాప్యతను అందిస్తుంది.

మెనూ సరఫరాకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో – పాడేరు : పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో శిక్షణ పొందనున్న 50 మంది గిరిజన విద్యార్థిని విద్యార్థులకు అధ్యాపకులకు సూచించిన మెనూ ప్రకారం రోజు వారి ఆహారం శిక్షణా కేంద్రంలోనే తయారు చేసి అప్పటికప్పుడి విద్యార్థులకు అందించుట కోసం ఆసక్తిగల వారు దరఖాస్తులను రేపు గురువారం సాయంత్రం వరకు అందజేయవచ్చని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న హెూటల్స్ యజమానులు, సంస్థలు లేదా వ్యక్తులు తు. చ. తప్పకుండా రోజు వారి ఆహారం నిర్ణయించబడిన మెనూ, సమయం ప్రకారం అమలు చేయవలసి ఉంటుందన్నారు. ప్రతిపాదిత మెనూ ప్రకారం ప్రతి ఒకొక్కరికి రోజుకు రూ. 200/– మించకుండా ప్రతిరోజు ఉదయం అల్పాహారం, మధ్యహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం సరఫరా చేయవలసి ఉంటుందన్నారు. వేపగుంట యూత్ ట్రైనింగ్ సెంటర్ ప్రాగణంలోగల వంటశాలలో మాత్రమే ఆహార పదార్థాలు తయారు చేసి అప్పటికప్పుడు అందిచవలసి ఉంటుందని, వంట సిబ్బంది, వంటసామగ్రి, ఆహార దినుసులు స్వయంగా దరఖాస్తుదారులే ఏర్పాటు చేసుకో వాలని పిఒ వివరించారు. ప్రాజెక్ట్ అధికారి నిర్ణయం మేరకు 19 వ తేదీ సాయంత్రం లేదా తదుపరి రోజులలో దరఖాస్తులు పరిశీలించి ఎంపిక చేయటం కాని, నిలుపుదల చేయుట కానీ మార్పులు చేయుటకు గానీ అధికారముందని పిఒ తెలిపారు.

బెంగుళూరులో డిసెంబర్ 12 నుంచి సీఐఐ ఎక్స్కాన్ 2023 ఎగ్జిబిషన్

విశాలాంధ్ర – విశాఖ సిటీ: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో దక్షిణాసియాలో అతిపెద్ద నిర్మాణ పరికరాల ఎగ్జిబిషన్ 'ఎక్స్కాన్ 2023' బెంగుళూరులోని బెంగుళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో డిసెంబర్ 12 నుంచి 16వ తేదీ వరకు జరగనుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సీఐఐ నగరంలో బుధవారం రోడ్డు షో నిర్వహించింది. భారతదేశం 2030 నాటికి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మాణ పరికరాల మార్కెట్‌గా ఎదగడానికి ఎక్స్కాన్ సిద్ధంగా ఉంది. విధానపరమైన సంస్కరణలపై బలమైన దృష్టి ఉంది. వివిధ ప్రాజెక్టులపై ప్రభుత్వ వ్యయం పెరగడంతో ఊపందుకుంది. ఇవన్నీ భారతదేశం గొప్ప మైలురాయిని సాధించడానికి సహాయ

పడతాయి. ఈ ఈవెంట్ 30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జరగనుంది. ఈ ఎగ్జిబిషన్లో యూఎస్‌ఏ, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యూఏఈ, దక్షిణ కొరియా, సింగపూర్, టర్కీ శ్రీలంక, రొమేనియా, చెక్ రిపబ్లిక్, భారతదేశం నుంచి 1200 మంది ప్రదర్శనకారులు రానున్నారు. ఈ సందర్భంగా దూసన్ బాబ్‌క్యాట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎక్స్కాన్ 2023 స్టీరింగ్ కమిటీ, కంట్రీ హెడ్ – సేల్స్ సభ్యుడు ఎస్ మంజునాథ్ మాట్లాడుతూ ఇది ఎక్స్కాన్ 12వ ఎడిషన్ అన్నారు. 'బిల్డింగ్ ఇండియాస్ టుమారో' అనే థీమ్ తో నిర్వహిస్తున్నామన్నారు.

రాజకీయాలు వ్యాపారమయం

పుస్తకావిష్కరణ సభలో ప్రొఫెసర్ కె.యస్.చలం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: దేశంలో రాజకీయాలు వ్యాపార మయమయ్యాయని ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించే లక్ష్యం వాటిలో లేవని యుపిఎస్సీ మాజీ సభ్యులు ప్రొఫెసర్ కె.ఎస్. చలం స్పష్టం చేశారు. నగరంలోని డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సమంతా సాహితి వేదిక, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రొఫెసర్ తెన్నేటి జయరాజ్ రచించిన ఓటు ఎవరికి వేయాలి? ఎందుకు వేయాలి ?అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చలం మాట్లాడుతూ ఆధిపత్య కుల పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు కోట్లు ఖర్చుపెట్టి తిరిగి అంతకంటే పది రెట్లు ఎక్కువ రాబట్టే లక్ష్యంతోనే ఎన్నికల్లో దిగుతున్నారని చెప్పారు. అంబానీ, ఆదానీ లాంటివారు ప్రత్యక్షంగా రాజ్యాధికారం లేకపోయినా పరోక్షంగా రాజ్యాధికారాన్ని చేలాయి స్తున్నారని పేర్కొన్నారు.. ఎన్నికల రంగంలో ఎస్సీ, ఎస్టీలు అమ్ము డైపోతారని ఆలోచనతో వారిని ప్రత్యేకంగా పరిగణించే పరిస్థితి మారిపోయిందని అందరి దృష్టి ఓబీసీల మీదనేనన్నారు.

డాక్టర్ మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక అభివృద్ధి కోసం, సమానత్వం కోసం ఓటు వినియోగం సాగడం లేదనే విషయాన్ని పుస్తకంలో రచయిత స్పష్టం చేశారన్నారు. సభకు అధ్యక్షత వహించిన అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జే.వీ. ప్రభాకర్ మాట్లాడుతూ ఓటు శక్తివంతమైందని దాన్ని సరైన మార్గంలో వినియోగించుకునే విధంగా ఐక్యత అవసరమన్నారు. పుస్తక రచయిత ప్రొఫెసర్ తెన్నేటి జయరాజు మాట్లాడుతూ సామాజిక ప్రజాస్వామ్యం కావాలంటే ఓటు ఎవరికి వేయాలనే దానిపై స్పష్టత రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు, డాక్టర్ జయరావు, మాజీ కార్పొరేటర్ కాట్రకన్నారావు, ఎస్సార్ వేమన తదితరులు మాట్లాడారు. వి.రాజేంద్రప్రసాద్, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, అలమండ ప్రసాద్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అంజలి శనివారం రహదారికి మోక్షం

విశాలాంధ్ర – చింతపల్లి: మండలంలోని మారుమూల పంచాయతీ అంజలి శనివారం పంచాయతీ ప్రధాన రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. రెండు కోట్ల రూపాయల నిధులతో రహదారి నిర్మాణం జరుగుతుంది. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల పూర్తి అయినప్పటికీ ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది అధికారులు మారినప్పటికీ మారని అంజలి శనివారం ప్రధాన రహదారికి ఎన్నో ఏళ్లుగా నోచుకోలేదు. నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభం కావడంతో ఆ పంచాయతీలోని గ్రామాల ప్రజలకు మరికొద్ది మాసాల్లోనే రహదారి కష్టాలు తీరనున్నాయి. రాష్ట్రంలోనే సిపిఐ పార్టీ విజయం సాధించిన ఏకైక పంచాయతీ అంజలి శనివారం కావడం గమనార్హం. గతంలో ప్రభుత్వాలు ఈ రహదారి సమస్యను పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షాల సమయంలో ఈ రహదారి పంట పొలాలను తలపించే విధంగా ఉండేది. సిపిఐ పార్టీ సర్పంచ్ పేట్ల రాజబాబు, వైసీపీకి చెందిన వైఎస్ ఎంపిపి సాగిన వెంగళరావు ల పట్టుదలతో పాడేరు శాసనసభ్యురాలు భాగ్యలక్ష్మి, అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ల ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు రహదారి నిర్మాణ పనులకు అంకురార్పణ కలిగింది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ రహదారికి బీటీ , మరియు సిమెంటు రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆ శాఖ డీఈ జి నరేన్ కుమార్, జే ఈ కే బాలకిషోర్ లు బుధవారం రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు.

ఐదుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో – అనకాపల్లి: జిల్లా ప్రధాన కేంద్రంలో ఏటీఎంను కొల్లగొట్టి సుమారు 15 లక్షల పైబడి నగదు చోరీ చేసిన ఘటనలో ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ బి.విజయ భాస్కర్ తెలిపారు. స్థానిక పోలీస్ అతిధి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో చోరీ వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది మే 28న కంటంరెడ్డి సోమునాయుడు అనే వ్యక్తి వచ్చి 27 రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అనకాపల్లి, పూడిమడక రోడ్ లో ఉన్న ఎస్బిఐ ఎటిఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి ఏటీఎంలో ఉన్న రూ..15, 17,300/– ను దొంగలించుకు పోయినట్లు రిపోర్ట్ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు గా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడానికి తెలిపారు. కొత్తూరు జంక్షన్ వద్ద దర్యాప్తు అధికారి, తమ పోలీస్ సిబ్బందితో మధ్యవర్తుల సమక్షంలో వాహన తనిఖీలు చేస్తుండగా సుమారు ఉదయం 11 గంటల సమయంలో ఎలమంచిలి వైపు నుండి అనకాపల్లి వైపు వస్తున్న హెచ్‌ఆర్ 73 ఏ 3526 నెంబరు గల లారీని ఆపగా అందులో ఉన్న 5 గురు ఆరిఫ్ ఖాన్ (పల్వాల్ జిల్లా, హర్యానా రాష్ట్రం), మొహమ్మద్ ముస్తుఫా(మేవాత్, హర్యానారాష్ట్రం), తహసిల్, మేవాట్, హర్యానా రాష్ట్రం, ఆఖిల్ ఖాన్ (పల్వాల్ జిల్లా, హర్యానా రాష్ట్రం), శంషేర్ (పల్వాల్ జిల్లా, హర్యానా రాష్ట్రం) వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. వారు గంజాయి తరలిస్తున్నారని క్షుణ్ణంగా తనిఖీ చేసి వలు వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనకాపల్లి లో ఏటీఎంఎల్ ను పై గ్యాస్ కట్టర్స్ ఇతర సామాన్లతో బ్రేక్ చేసి అందులో ఉన్న రూ...15,17,300/– ను దొంగలించుకు పోయినట్లు దానికి గాను ఎవ్వరికీ అనుమానం రాకుండా ఎలమంచిలి లో ఒక తవేర వాహనమును దొంగిలించి దాని ద్వారా అనకాపల్లి వచ్చి ఏటీఎంను బ్రేక్ చేసి దొంగతనం చేసి అక్కడ నుండి నక్కపల్లి దగ్గరలో టోల్ గెట్ వద్దకు వెళ్ళి అక్కడ తవేరా వాహనమును వదిలేసి అక్కడ నుండి వెళ్లిపోయామని అంగీకరించినట్లు తెలిపారు.

విశాఖ ఏజెన్సీ కు చెందిన గంజాయిను గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా 22 కేజీల గంజాయిని కొని, దగ్గరలో ఏదైనా ఏటీఎం దొంగతనము చేద్దామని వస్తుండగా పోలీస్ వారికి దొరికిపోయామని తమ నేరాన్ని అం గీకరించినట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో అనకాపల్లి సబ్ డివిజన్ ఇంచార్జ్ మల్ల మహేశ్వ రరావు, ఎన్.హెచ్.ఓ డి.మోహన్ రావు, ఎస్సైలు సింహాచలం సత్యనారాయణ పాల్గొన్నారు.

నకిలీ కుల ధృవీకరణ పత్రం జారీ చేసిన

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర – అరకులోయ: నకిలీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన సంబంధిత తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం స్థానిక గిరిజన సంఘం భవనంలో ఆదివాసి గిరిజన సంఘం సమావేశం ఏర్పాటు చేసింది. అల్లూరి జిల్లా ఆదివాసి సంఘం ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నకిలీ ఎస్టి కుల ధ్రువీకరణ పత్రాలు అధికారులు విచ్చలవిడిగా చట్టాలకు వ్యతిరేకంగా జారీ చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. గతంలో పిట్టల రాంబాబు అనే గిరిజనేతరుడు వ్యవహారంలో కూడా ఇలాగే వ్యవహరించారని అతనిపై జరిపిన విచారణ ఏం జరిగిందో ఇప్పటివరకు బహిర్గతం చేయలేదన్నారు. పిట్టల రాంబాబు వ్యవహారం మరవక ముందే ఇప్పుడు అదే ఇంటి పేరుతో పిట్టల ప్రసాద్ తండ్రి వెంకటస్వామి అనే గిరిజనేతరుడుని తేదీ 08వ తేదీన మే నెల2023లో ఎస్టీ బగత కుల ధృవీకరణ పత్రం జారీ చేసి ఉన్నారని ఆయన ఆరోపించారు. గతంలో పిట్టల రాంబాబు తండ్రి ఆదినారాయణపై జరిపిన విచారణ బహిర్గతం చేయాలన్నారు. బాధ్యులైన రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యల తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి. బుజ్జిబాబు, మండల నాయకులు సిహెచ్ గురు మూర్తి, కే.జగన్నాధం, హరీ, కుమారీ నానిబాబు, గాసీ, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష



విశాలాంధ్ర – నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ 16వ వార్డులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఆరోగ్యం బాగుండాలనే లక్ష్యంతో, ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ చెప్పారు. అంగన్వాడి కార్యకర్తలు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో 16వ వార్డ్ కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, లలిత మల్టీస్పెషాల్టీ హాస్పిటల్ వైద్యులు హనుతేజ్, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకాశివ ,తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ తమ సొంత గ్రామంలోనే ఉత్తమమైన వైద్యాన్ని ఉచితంగా అందించాలనే సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరున హెల్త్ క్యాంపు నిర్వహించడం గ్రామీణ పేదలందరికీ వరమని జేసిఎస్ కన్వీనర్ ఆవులు మరియదాసు అన్నారు. బుధవారం కూనవరంలోని జడ్పీ హైస్కూల్ నందు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు స్థానిక ఎంపీపీ

పాయం రంగమ్మ, సర్పంచ్ మల్లంపల్లి హేమంత్, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, మెరుకుల కార్పొరేషన్ డైరెక్టర్ దికొండ లక్ష్మీప్రసాద్, గంగాధర్ ప్రజాప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. సుమారు 376 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు గైనకాలజిస్ట్ డాక్టర్ రమణారావు, చర్మ వ్యాధులు డాక్టర్ సాయికిరణ్, ఎముకలు కీళ్ల నొప్పులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, జనరల్ మెడిసిన్ డాక్టర్ రాజీవ్ సునీల్, హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్, సీత, సర్పంచ్ మల్లంపల్లి హేమంత్, సచివాలయం కన్వీనర్లు ఎలిపే రమేష్, జోడె లక్ష్మి, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: గిరిజనుల ఆరోగ్య సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పా టు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలో గల పాతుకోట పంచాయతీలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి కలెక్టర్, ఎమ్మెల్యే ఫాల్గుణలు పాల్గొని రోగులకు అందుతున్న వైద్య సేవలు పరిశీలించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరి గ్రామాల్లో ప్రజలు అంతుచిక్కని వ్యాధులకు గురై వాటికి సరైన వైద్యం తీసుకోకుండా మృత్యువాత పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒకరిని పరీక్షించి వ్యాధి గుర్తించి వారిని మెరుగైన వైద్యం కోసం విశాఖలో ప్రభుత్వ ప్రవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజరావు, జేడ్పీటీసీ మత్స్య లింగం, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సర్పంచ్ పాటీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ చంద్ర, సచివాలయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్ బాలన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అభి, మహిళ పోలీస్ నీలిమ, సర్వేయర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: ప్రతి పేదవారికి సంపూర్ణ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమని ప్రోగ్రాం ప్రత్యేక అధికారి పద్మ తెలిపారు. ఆనందపురం మండలం సొంత్యం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి తనిఖీలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పద్మ, ఆరోగ్య



విస్తరణ అధికారి పరమేశ్వర రావు, ఎంపీడీవో అడపా లవ రాజు, ఈఓఆర్డి రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, సర్పంచ్ లంక రాంబాబు, డాక్టర్లు గంగు నాయుడు, సాంబమూర్తి పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కోరుతూ శత్రుజయ హెూమం

విశాలాంధ్ర – అరకులోయ: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు త్వరగా విడుదల కావాలని కోరుతూ టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర ఆధ్వర్యంలో శత్రు జయ హెూమాన్ని బుధవారం నిర్వహించారు. పెదలబడు గ్రామ శివాలయంలో నిర్వహించిన హెూమంలో సర్పంచ్ పెట్టెలి దాసుబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాసుబాబు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత కడిగిన ముత్యంలా బయటికి రావాలని ఈ హెూమం నిర్వహించినట్లు ఆయన చెప్పారు. చంద్రబాబునాయుడు తప్పు చేశారని వైసిపి ఆరోపిస్తే దేశం మొత్తం దాన్ని వ్యతిరేకించిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి కిడారి శ్రావణ్ కుమార్, టిడిపి నాయకులు బూర్జ లక్ష్మి, కొర్ర నీరజ, నిర్మల, గంగ, బొరి బొరి లక్ష్మి, పొద్దు అమ్మన్న ,మండల టిడిపి అధ్యక్షుడు శెట్టి బాబురావు, సాయిరాం, మాజీ సర్పంచ్ పద్మాపురం మహదేవ్, ఎంపిటిసి స్వామి, టిడిపి నాయకులు బొడ్డ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి దేవీ అవతారంలో దుర్గమ్మ



విశాలాంధ్ర – ఎటపాక : మహాలక్ష్మి దేవీ అవతారంలో దుర్గమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో భాగంగా ఎటపాక మండలం గుండాల కాలనీ కనక దుర్గా యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన నవరాత్రి మండపంలో బుధవారం శ్రీ మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

అగ్ని బాధితులను ఆదుకున్న నవ్య లయన్స్ క్లబ్

విశాలాంధ్ర – నర్సీపట్నం: గొలుగొండ మండలం గుండుపాల గ్రామంలో అగ్నికి ఆహుతైన గృహాలను సందర్శించడానికి నవ్యాలయన్స్ క్లబ్ సభ్యులు గుండుపాల వెళ్లారు. బాధితులకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు నెల రోజులకు సరిపడా బియ్యం, కిరాణా సామాగ్రిని నవ్య సభ్యులు అందజేశారు. అంతేకాకుండా నవ్యా లయన్స్ క్లబ్ సభ్యులు చెరుకూరి ఇందిర, వెలగా నారాయణరావు ప్రతినెల 2000 రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో చింతకాయల సన్యాసి పాత్రుడు, క్లబ్ అధ్యక్షులు జి.చంద్ర రాజు, సభ్యులు కన్నబాబు, రామ్ గోపాల్, పద్మనాభుని కన్నయ్యశెట్టి, గుండుపాల సర్పంచ్ జోగి రామకృష్ణ పాల్గొన్నారు. జమీల్ మాట్లాడుతూ త్వరలో గృహ నిర్మాణం సమయంలో మరింత ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సీబిఎస్ఈ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు

విశాలాంధ్ర – పాయకరావుపేట: ఈనెల 14 నుండి 16వరకు హైదరాబాదులో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ –7 కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో శ్రీప్రకాష్ జట్టు ప్రథమస్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. నవంబర్ 24న హర్యానా రాష్ట్రం, కర్నాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేతలు సీహెచ్‌వికె నరసింహారావు, సీహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ మూర్తి, అపర్ణ, నీలాదేవి, కోచ్ లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కాగడాల ప్రదర్శన

విశాలాంధ్ర – పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మాజీ ఎంపిపి గొర్రెల రాజబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు మజ్జూరి నారాయణరావు ఆధ్వర్యంలో పట్టణంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవవరపు ఆనంద్‌కుమార్, కలిగట్ల శ్రీను, గొల్లపల్లి నాగు, తలారి రాజా, భజంత్రీల శివ, గంపల సుబ్బారావు, కోదూరు నూకరాజు, గంటా థామస్, నారపురెడ్డి నానాజి, ముత్తి జగదీష్ తదతరులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారే ఊరేగింపు

విశాలాంధ్ర – నర్సీపట్నం: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని శివపురంలో 27వ వార్డు ఇంచార్జ్ కొణతాల వరలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి సారె ఊరేగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. శివపురం వీధుల నుంచి అబిడ్స్ సెంటర్ మీదుగా దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకుంది.

చంద్రబాబు అరెస్టు అన్యాయం

విశాలాంధ్ర – వి.ఆర్.పురం: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు అన్యాయమని టిడిపి వాణిజ్య విభాగ అధ్యక్షుడు బీరక సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. రంపచోడవరం నియోజకవర్గ ఇంచార్జ్ వంతల రాజేశ్వరి ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల నాయకులు బుధవారం నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిని కలిసి ఈ అక్రమ అరెస్టును ఖండిస్తూ సంఘీ భావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి అచ్చిరాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్, బూత్ ఏజెంట్ రేవు శివ తదితరులు పాల్గొన్నారు.

మిలిసియా సభ్యులు అరెస్ట్

- మవోయిస్టు పార్టీ సభ్యురాలు,ముగ్గురు మిలిషియా సభ్యులను అదుపులోకి తీసుకుని పోలీస్ శాఖ
- వివరాలు వెల్లడించిన కె.వి.మహేశ్వర రెడ్డి(ఐపిఎస్)

విశాలాంధ్ర - ఎటపాక : మావోయిస్టు పార్టీకి చెందిన ఎల్ ఓ ఎస్ పార్టీ సభ్యురాలు సోడి మంగి మరియు మలిషియా సభ్యులను ఎటపాక పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు.అల్లూరిసీతారామ రాజు జిల్లా ఎటపాక మండలం ఎటపాక పోలీస్ స్టేషన్ లో బుధవారం ఎటపాక సిఐ గజేంద్ర కుమార్ అధ్వర్యంలో,ఎటపాక ఎస్సై కె.పార్థసారథి నేతృత్వంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ .జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా(ఐపిఎస్) అడిషనల్ ఎస్పీ కె వి.మహేశ్వర రెడ్డి(ఐపిఎస్)ఆదేశాల మేరకు మావోయిస్టు కార్యకలాపాలను అరికట్టడంలో బాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గొల్లగుప్ప గ్రామ శివారు అటవీ ప్రాంతంలో స్టేట్ స్పెషల్ పోలీస్ పార్టీ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తుండగా కుంబింగ్ చేస్తున్న పోలీస్ పార్టీలపై మందు పాతరతో పేల్చి హతమర్చలనే ఉద్దేశ్యంతో సోడి మంగి,మావోయిస్టు పార్టీ నాయకులు మరియు మిలిషీయా సభ్యులతో కలసి గొల్లగుప్ప గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మందు పాత్ర అమర్చలని ఉద్దేశ్యంతో ఉండగా సోడి మంగి తన చేతుల్లో ఉన్న సంచితో సహ పోలీసులకు పట్టుబడినది అని,ఆమెతో పాటు వున్న మావోయిస్టు పార్టీ నాయకులు,సభ్యులు మరియు మిలిషియా సభ్యులు తప్పించుకున్నారని,పట్టుబడిన సోడి మంగి వద్దా గల సంచి లో డిటో నేటర్స్ 2,ఆర్ డి ఎక్స్ వైరు రెండు మీటర్లు,చిన్న బ్యాటరీ 1,ఐరాన్ ముక్కలు 10,ఎలక్ట్రికల్ వైరు 10 మీటర్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందనీ,ఆయన తెలిపారు.సోడి మంగి డి/ఓ సుక్క(25) కొత్తి కోయ కులానికి చెందిన ఆమె కుంబంపార,అర్లం పల్లి గ్రామం,మేడువాయి పంచాయితీ పొలం పల్లి పోలీస్ స్టేషన్ పరిధి, సుకుమా జిల్లా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రానికి చెందిన ఆమె మావోయిస్టు పార్టీ కి చెందిన కుంట ఎల్ ఓ ఎస్ కమాండర్ సోమ కామ ప్రోద్బలంతో 2018వ సంత్సరం లో పార్టీ సభ్యురాలి గా చేరిందని,అప్పటి నుంచి ఇప్పటి వరకు మావోయిస్టు పార్టీ సభ్యురాలు గా కొనసాగుతూనే వుందని,చింతూరు సబ్ డివిజన లో న్యూ,ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం లోని అనేక నేరాలలో ఆమె పాల్గొన్నది అని, ఈమెను ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో ముద్దాయిగా గుర్తించడం జరిగింది అని ఆయన తెలిపారు. మిలిషియా సభ్యులు అయిన మడకం లింగ ఎస్/ఓ జోగా (24) ,మడకం రామయ్య ఎస్/ఓ ఐరమయ్య (50), కురసం బీమయ్య ఎస్/ఓ సీతారామయ్య(25) కొత్తి కోయ కులానికి చెందిన వారు అని,దోర్ల మైత గ్రామం, కుంట పోలీస్ స్టేషన్ పరిధి సుకుమా జిల్లా ఛత్తీస్ ఘడ్ రాష్ట్రమని, ఎటపాక మండలం చెరువు గుంపు గ్రామానికి చెందిన మడివి రాజ్ కుమార్ ను కిడ్నాప్ చేసి చతిస్గడ్ లోనే మైతా వద్ద గొంతు కోసి చంపిన ఘటనలో మీరు పాల్గొన్నారు అని,చింతూరు మండలం సరివేల గ్రామ శివారు జాతీయ రహదారిపై కె.వి.ఆర్ ట్రావెల్స్ చెందిన బస్సు నిప్పు పెట్టిన ఘటనలో పాల్గొన్నారు అని 2023 జనవరి నెలలో చింతూరు పిఎస్ పరిధిలో గల బుర్కన్ కోట గ్రామంలో సోయం సుబ్బయ్య అనే వ్యక్తి నీ పోలీస్ ఇన్ ఫార్మర్ అని నెపంతో చంపిన ఘటనలో మీరు పాల్గొన్నారు అని,ఆయన తెలిపారు.నిషేధ మావోయిస్టు పార్టీకి ఎవరైనా సహకరించి సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అదే విధంగా మావోయిస్టులకు సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే పోలీసులకు తెలియపరచాలని ఆయన అన్నారు.ఎంతో చాకక్యంగా మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న ఎటపాక సిఐ గజేంద్ర కుమార్,ఎస్సై కె.పార్థసారథి మరియు సిఆర్పిఎఫ్ సిబ్బంది పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు ఆయన తెలియజేశారు.

చంద్రబాబు అరెస్టుతో సిఐడి కుట్రలు బట్టబయలు : బుద్ధ నాగజగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుదు ను జగన్ రెడ్డి ప్రభుత్వం, సిఐడి అధికారులు కుమ్మక్కై అక్రమ కేసులు పెట్టి 38 రోజులుగా జైల్లో ఉంచి ప్రభుత్వం రోజుకొక జీవో విడుదల చేస్తూ చంద్రబాబును లేకుండా చేయాలని దురుద్దేశంతో అతని ఆరోగ్య పరిస్థితి పై హెల్త్ బులిటన్లో వాస్తవాలను దాచి వేయడం, రోజువారి మూలాకత్ కుదింపు వంటి చర్యలకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నందుకు నిరసనగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సైకిల్ ర్యాలీ పట్టణంలో చేపట్టామని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు జగన్ రెడ్డి పై మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలను పక్క తోవ పట్టించడానికి చంద్రబాబు నాయుడు ప్రజలు కేసుల మీద కేసులు సిఐడి అధికారుల చేత పెట్టిస్తున్నారని, వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం దివాలా తీసింది అని చీఫ్ సెక్రటరీ జోహార్ రెడ్డి ప్రకటించారని, రోజువారి మద్యం నమ్మకం పై వచ్చే 15 కోట్లతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, దసరా పండగ వస్తున్న అక్టోబర్ నెల జీతాలు, ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు తదితరులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని, గత రెండు మాసాలుగా రోజువారీగా రిజర్వ్ బ్యాంక్ దగ్గర అప్పులు తీస్తున్నారని, ఇప్పటికే ప్రభుత్వం అప్పు 10,97,000 వచ్చిందని, దీనిలో ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో ? 2,31,000 కోట్లు రూపాయలు మాత్రమే ఇచ్చారని, తక్కిన 8,66,000 కోట్లు ఎక్కడికి వెళ్లాయో లెక్కలు చెప్పడం లేదని, అడిగిన వారిపై ఎదురుదాడి చేస్తున్నారని, అభివృద్ధికి ఖర్చు చేశారేమో అనుకుందామన్న రాజధాని నిర్మాణం చేయలేదని, రాష్ట్రంలో ఎక్కడ రోడ్లు నిర్మాణాలు చేపట్టలేదని, మరి ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందో, ఎవరి దగ్గర ఉందో, అసలు ఈ దేశంలో ఉందా విదేశాలకు తరలించేసారా అనే అనుమానాలు ప్రజలకు ఉందని నాగ జగదీష్ వ్యాఖ్యానించారు.. డాక్టర్ కే కే వి ఏ నారాయణ రావు మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రంలో ఉద్యోగులకు 31,519 కోట్లు బకాయి పడ్డారని, సకాలంలో జీతాలకే దిక్కు లేదని, పిఆర్సి, డి ఎ, సిపిఎస్ కాంట్రిబ్యూషన్, మెడికల్ బిల్లులు, జిపిఎఫ్, ఏపీ జి ఎల్ ఐ, సరెండర్ లీవ్లు, లీవ్ ఎన్ క్యాషమెంట్ల రూపంలో తమకు అందవలసిన ఆర్థిక ప్రయోజనాలను ఈ ప్రభుత్వం తెలుస్తుందని నమ్మకం లేదని ఉద్యోగస్తులు వాపోతున్నారనినాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ధనాల విష్ణుకుమార్ చౌదరి సూరే సతీష్ కడి మిశెట్టి నరసింగరావు సాలాపు నాయుడు మారిశెట్టి శంకర్రావు వేగి వెంకట్రావు గుడాల సత్యనారాయణ పూడి త్రినాథ్ కరి మల్లేశ్వరరావు ఎర్రంశెట్టి వెంకటి పెంటకోట శివరామ దాడి వేణు కోరు కొండ అప్పారావు సిమ్మేటి రామకృష్ణ పొలిమేర నాయుడు పాల్గొన్నారు.

దసరా సెలవులును ఇంటర్మీయట్ కాలేజీ యాజమాన్యాలు శత శాతం పాటించాల్సిందే

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : దసరా పండుగను పురస్కరించుకొని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 19 నుండి 25 వరకు విధిగా రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ఇంటర్మీడియట్ కళాశాలల యాజమాన్యాలు విధిగా సెలవులు పాటించాల్సిందేనని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. పిఠాపురం కోలనిలోని ఇంటర్మీడియట్ ఆర్ఐఓ కార్యాలయంలో బుధవారం అధికారులతో ఆర్ఐఓ ఆర్.సత్యన్నారాయణ నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ గత ఏడాది రాష్ట్రప్రభుత్వ ఆదేశాలను సైతం పక్కన పెట్టి దసరా సెలవులు పాటించడంలో నిర్లక్ష్యం వహించి ప్రత్యేక తరగతులు,వెనుకబడిన విద్యార్థులు,ఐఐటి,నీట్ తరగతుల పేరిట తరగతులు నిర్వహించినట్టు ఆధారాలతో కూడిన కళాశాలల వివరాలు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ దగ్గర ఉన్నాయని అన్నారు,విద్యార్థుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఈ ఏడాది ముందస్తుగానే అన్ని జిల్లాల ఆర్ఐఓలకు సెలవులపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు, జిల్లా ఇంటర్మీడియట్ ఆర్ఐఓ ఆర్.సత్యన్నారాయణ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు,రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలతో జిల్లాలోని అన్ని కళాశాలల్లో దసరా సెలవులు అమలు జరిగేలా ఇప్పటికే తనిఖీ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఉల్లంఘనలకు పాల్పడే కళాశాలలపై చట్ట ప్రకారం చర్యలకు సిద్ధంగా ఉన్నామని,సెల్ నెంబర్ 9392911802,0891-2552854 లకు ఫిర్యాదులందించాలని సూచించారు.

జనసేన బలోపేతానికి కృషి చేస్తాం

విశాలాంధ్ర - కే కోటపాడు : మాడుగుల నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ నాయకులు కుంచా అంజిబాబు తెలిపారు. బుధవారం విశాఖ రూరల్ జిల్లా జనసేన అధ్యక్షులుగా నియమతులైన పంచకర్ల రమేష్ బాబును మాడుగుల నియోజకవర్గ నాయకులు రాయపరెడ్డి కృష్ణతో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ పంచకర్ల నాయకత్వంలో జనసేన పార్టీ అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. త్వరలో మాడుగుల నియోజవర్గంలో పర్యటించాలని కోరారు. పంచ కర్లను కలిసిన వారిలో మారపు రెడ్డి శివ, వల్లంశెట్టి రాము, నాగులపల్లి మల్లు నాయుడు, కుమార అప్పారావు తదితరులు ఉన్నారు .

జగనన్నకు చెబుదాం ద్వారా సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర - చీడికాడ : జగనన్నకు చెబుదాము కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లాకలెక్టర్ రవి సుభాస్ పటాన్ శెట్టి అన్నారు మండల కేంద్రంలోని నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఆయన విచ్చేశారు ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులు అయన ఆదేశించారు ఈకార్యక్రమంలో జిల్లాజాయింట్ కలెక్టర్ జాహ్నవి అసిస్టెంట్ కలెక్టర్ శర్మ డిఆర్డిఏ పిడి లక్ష్మీపతి ఏ ఎస్ పి ప్రభాకరరావు ఇతర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు

ఎం.కోడూరులో వైభవంగా అమ్మవారి సారే ఊరేగింపు

విశాలాంధ్ర - వి.మాడుగుల : మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామంలో శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి నవరాత్రులను పురస్కరించుకొని బుధవారం సారె ఊరేగించి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే అమ్మవారికి కుంభ వాయునంగా మహా నివేదన చేశారు. ముందుగా ఆలయ నిర్వాహకులు కోలా రాము అమ్మవారి పాదాలను శిరస్సున ధరించగా వందలాది మంది భవానీలు, రకరకాల పిండి ంటలు, పండ్లను గ్రామ పురవీధులలో ఊరేగించారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మాకవరపాలెం : దుర్గామల్లేశ్వర అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. మాకవరపాలెం బీసీ కాలనీలో ఉన్న దుర్గామల్లేశ్వర ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నిత్యం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం అమ్మవారితోపాటు ఆలయం లోపల 25 లక్షల రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరించారు. దీంతో అమ్మవారు లక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం వరకు అమ్మవారు కరెన్సీ నోట్ల అలంకరణలో దర్శనమిచ్చారు అని ఆలయ అర్చకులు మల్లిఖార్జున శర్మ తెలిపారు.

సమస్యలు పరిష్కారించాలని వినతి

విశాలాంధ్ర - చీడికాద : మాడుగుల నియోజకవర్గం లోని సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు జిల్లాకలెక్టర్ రవిసుభాష్ పటాన్ శెట్టి కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే సజవుగా సాగలేదని దీనివలన సమస్యలు తలెత్తుతున్నాయన్నారు నియోజకవర్గంలోని తిమరాం కింతాడతో సహా శారదా నది పరివాహక ప్రాంతాలలో అనేక చోట్ల ఇసుక అక్రమ త్రవ్వకాలు యదేచ్ఛగా సాగుతున్నాయన్నారు ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు వినిపించుకున్నా పట్టించుకోలేదన్నారు మాడుగుల మండలంలోని ఘాటీరోడ్డు నుంచి కింతలి వద్దాది నుండి తాడిపర్తి కి వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయని ఈరోడ్లలో ప్రయాణించేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని నాలుగు మండలాలలో శీతల గడ్డంగులు ఏర్పాటు చేయాలని, రైతులకు పంట నిల్వలు సౌకర్యం లేక నష్టపోతున్నారన్నారు నియోజకవర్గంలో ఒక ఐటిఐ పాలిటెక్నిక్ కాలేజీలను ఏర్పాటుచేయాలనీ అన్నారు పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళమన్నారు ఈకార్యక్రమంలో పేరపు కొండబాబు రెడ్డి సన్నాసినాయుదు గండి ముసలినాయుదు రెడ్డి రాము బొద్దు అక్కునాయుదు దొగ్గా బలరాం తదితరులు పాల్గొన్నారు

త్రాగునీటి ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - చింతపల్లి : జల జీవన్ మిషన్ ద్వారా త్రాగునీటి సమస్యకు చెక్ పెట్టేందుకు వైకాపా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా మండలంలోని మారుమూల బలపం పంచాయతీ లో కిష్ట వరం గ్రామానికి జల జీవన్ మిషన్ పథకం ద్వారా త్రాగునీటి ట్యాంక్ నిర్మాణం కొరకు ఆ పంచాయతీ సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి మన్యంలో నెలకొన్న రహదారి త్రాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ కనబరుస్తుందన్నారు. ఇందులో భాగంగా కృష్ణవరం గ్రామానికి 7 లక్షల రూపాయలు నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా త్రాగునీటి ట్యాంక్ నిర్మాణానికై భూమి పూజ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి చిన్నం నాయుదు, మహిళా పోలీస్ రమణ కుమారి, వాలంటరీ మురళి, జానూ గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం ప్రత్యేక హోమాలు

ఏ.పి.బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా మాజీ కో ఆర్డినేటర్ మూర్తి

విశాలాంధ్ర - చోదవరం : మాజీ సి.ఎం., టి.డి.పి. జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్దోషిగా జైలునుండి విడుదల కావాలని, ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ శ్రీ దుర్గా దేవీ నవరాత్రుల సందర్భంగా రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన యువజనవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ విశాఖజిల్లా మాజీ కోఆర్డినేటర్ కొమ్మన మంచి నరసింహామూర్తి కుటుంబ సమేతంగా చండీ హెూమం, ఆయుష్య హెూమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గార్కి జైలులో ఆరోగ్యం క్షీణించడం ఆందోళన కలిగిస్తోందని, చేయని నేరానికి రాజకీయ కక్ష తోజైలులో పెట్టారని త్వరలోనే ఆయన అనారోగ్యం నుంచి కోలుకొని నిర్దోషిగా జైలునుంచి బయటికి రావాలని దుర్గాదేవిని కోరుకున్నట్లు నరసింహామూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి సోదరులు, బంధువులు కొమ్మనమంచి వెంకట్రావు దంపతులు, కొమ్మనమంచి జగన్నాథరావు దంపతులు పాల్గొన్నారు.

చిన్నారికి చేయూతనందించిన యూటీఎఫ్

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలం చికిలింత గ్రామం ఎంపిపి స్కూల్ లో చదువుతు ప్రమాదవశాత్తు గాయపడిన జుర్రా రిషవర్ధన్ బాబుకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఫెడరేషన్ ఉపాధ్యాయ మిత్రులు మరియు కొన్ని పాఠశాల విద్యార్థులు వైద్య సహాయార్థం సేకరించిన నగదు 40,650 ను యూటీఎఫ్ యూనియన్ మండల కమిటీ, స్థానిక సర్పంచ్ కోండ్ల సూరిబాబు ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని,యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఉదయ్ తెలిపారు ,జిల్లా కార్యదర్శి రాజబాబు ,గౌరవ అధ్యక్షులు సత్యవతి ,యూటీఎఫ్ అధ్యక్షులు పైడిమల్లి, ప్రధాన కార్యదర్శి రమణ, అసోసియేట్ అధ్యక్షులు సుబ్బారావు, అసోసియేట్ మహిళా అధ్యక్షులు లక్ష్మీ ప్రసన్న, కోశాధికారి శ్రీను,ఆడిటర్ సతీష్, జిల్లా కౌన్సిలర్ రమేష్,స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు కాంప్లెక్స్ బాధ్యులు శేఖర్ బాబు,పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ,అమీనానాబాద్ కాంప్లెక్స్ యూటీఫ్ బాధ్యులు చిట్టిబాబు,బుజ్జి బాబు, రాజ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సహార్ ఇండియా 12 కోట్ల మంది ఖాతాదారులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి

అగనంపూడి శాఖ సహార్ ఇండియా మేనేజర్ ఎలమంచిలి దేముడు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : అగనంపూడి సహార్ ఇండియా ఖాతాదారులు సమావేశంలో ఎలమంచిలి దేవుడు మాట్లాడుతూ 12 కోట్లు ఖాతాదారులు 86వేల కోట్లు డిపాజిట్ తో 12 లక్షల మంది స్టాప్ ఉన్న సహార్ ఇండియా పై ఖాతాదారుల నుండి ఎటువంటి ఫిర్యాదు లేకపోయినా గత ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఖాతాదారులను ఇబ్బందికి గురి చేస్తున్నారు. చిరు వ్యాపారస్తుల్ని ఆదుకునే కల్ప వృక్షం లాంటి సంస్థను వీధిలోనికి లాగి ఖాతాదారులను దానిపై జనజీవనం సాగిస్తున్న స్టాప్ ని చాలా ఆవేదనకు గురవుతున్నారు. అగనంపూడి శాఖలో 11 వందల మంది ఖాతాదారులు 35 కోట్ల డిపాజిట్లు చేసి ఉన్నారు మూడు సంవత్సరాల నుండి సిబ్బందికి జీతాలు లేక కార్యాలయానికి ఐదు లక్షల రూపాయలు అద్దె బకాయి ఉన్నది సహార్ ఇండియా యాజమాన్యం ఎటువంటి తప్పు లేకుండా కోర్టు గొడవల్లో ఖాతాదారులను ఇబ్బంది గురి చేస్తున్నారు . ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ వేలాది కోట్లు బ్యాంకుల లో రుణాలు తీసుకొని వేగనామ పెట్టి విదేశాలకు పోతున్న వారిపై ఎటువంటి చర్యలు లేవు చిరు వ్యాపారస్తులు పేదవారికి మేలు చేస్తున్న సహార్ ఇండియా సంస్థ పై రాజకీయ దురుద్దేశంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం జరిగింది ఖాతాదారులు సంస్థ పై ఎటువంటి ఫిర్యాదులు ఇవ్వకపోయినా గతంలో సహార్ ఇండియా ఇటీవల మార్గదర్శిపై ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యతో అక్రమ కేసులు పెట్టి ఖాతాదారులను ఇబ్బంది గురి చేస్తున్నారు సంస్థలు సక్రమంగా నడుపుతూ ఖాతాదారుకు మెరుగైన సేవలు అందిస్తున్న సమయంలో కోర్టు కేసు వివాదాల్లో పెట్టి ఖాతాదారులను స్టాప్ ని ఇబ్బందికి గురిచేస్తున్నారు, స్టాప్ ఫీల్డ్ అసిస్టెంట్లు పై ఖాతాదారులు ఆందోళన చేస్తున్నారు ఇటువంటి పరిస్థితులపై ఖాతాదారులు ఎవరైనా ఆత్మహత్యలు చేసుకుంటే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి అని అన్నారు. అగనంపూడి శాఖ సహార్ ఇండియా చీఫ్ ఫీల్డ్ మేనేజర్ కడిమి హనుమంత రావు సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఖాతాదారుల ప్రతినిధి బలిరెడ్డి శ్రీను సహార్ ఇండియా ఫీల్డ్ అసిస్టెంట్లు కే ఎల్లారావు ఎం శ్రీనివాసరావు జి సాంబమూర్తి పి చిట్టెమ్మ మరియు ఖాతాదారులు పాల్గొన్నారు.

చెరకు రైతుల కష్టాలు పట్టించుకోని పాలకులు

విశాలాంధ్ర - చోదవరం : గోవాడ చక్కెర కర్మాగారానికి గతేడాది సరఫరా చేసిన చెరుకు బకాయిలు సుమారు రూ. 9 కోట్లు తక్షణమే చెల్లించాలని బి.జె.పి.రాష్ట్ర మీడియా ప్రతినిధి ఈర్లె శ్రీరామ మూర్తి డిమాండ్ చేశారు. బి.జె.పి.నియోజకవర్గ కన్వీనర్ కందర్ప రమణ మూర్తి అధ్యక్షతన చోడవరం లో బుదవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఈర్లె మాట్లాడుతూ సహకార చక్కెర కర్మాగారం యాజమాన్యం, పాలకుల నిర్లక్ష్యం వెరసి చెరకు రైతాంగం ఆత్మ హత్యలకు వెళ్ళే పరి స్థితి దాపురిస్తున్నాయన్నారు. ఫ్యాక్టరీ మహాజనసభ సాక్షిగా గత సంవత్సరానికి సంబంధించిన బకాయిలను చెల్లిస్తామని హామీలు ఇచ్చి, నమ్మ బలికిన ఉప ముఖ్యమంత్రి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఇప్పటివరకు తమ హామీలు నిలబెట్టుకోలేదన్నారు. 1962 లో 1250 ఎం.టి. రోజువారీ చెరకు క్రషింగ్ తో ఈ ప్రాంత రైతాంగం సహకారంతో ఏర్పాటైన చక్కెర కర్మాగారం అంచెలంచెలుగా ఎదిగి 10 రాష్ట్ర, జాతీయ అవార్డులు సాదించి అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిన చోడవరం సుగర్స్ నేడు పాలకులు, సుగర్స్ అధికారులు నిర్లక్ష్య ధోరణి తో రైతాంగం సరఫరా చేసిన చెరకు కు చెల్లింపులు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.జె.పి.చోడవరం అధ్యక్షుడు బుద్ధ అమర్నాథ్, బుచ్చయ్యపేట అధ్యక్షుడు సీతా నాగరాజు, అనకాపల్లి కార్యదర్శి దూది రాజేష్ చెరకు సభ్య రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - గాజువాక : ఈ నెల 22 న ఉక్కు నగరంలోని సీభవన్‌లో సాయంత్రం 6 గంటలకు జరిగే బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలిపింది . బుధవారం జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. కుమార స్వామి, జి. ఆనంద్ మాట్లాడుతూ ఈ వేడుకలకు ఉక్కు సీ. జీ ఎం (వర్క్స్) ఇంఛార్జి ఎన్. వి. స్వామి ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా డబ్ల్యు ఎండి, ఎస్.ఎం ఎస్ ం1 విబాగాది పతులు హాజరవు తున్నారని తెలిపారు. ఉక్కు లోని తెలంగాణ ఉద్యోగ కుటుంబాలు హాజరు కావాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిదులు బి. వెంకటేశ్వర్లు, ఎన్ .నర్సింగరావు, జి.మల్లేశం, టి.ప్రభాకర్ , సి.హెచ్ రవి కుమార్, అధికారులు ఎన్.వీరేశం, బి. గణేష్, మోతుకూరి వేణు గోపాల్, బి.వీరయ్య పాల్గొన్నారు.

చిలకవీధిలో పర్యటించిన జనసేన నాయకులు

విశాలాంధ్ర - సీలేరు : జికేవీధి మండలం అమ్మవారి దారకొండ పంచాయతీ మారుమూల గ్రామమైన చిలకవీధి గ్రామస్తుల పిలుపుమేరకు జనసేన పార్టీ నాయకులు, లీగల్ అడ్వైజర్ కిల్లో రాజన్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇన్చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య మాట్లాడుతూ ఈ గ్రామంలో పరిస్థితులు సోషల్ మీడియాలో చూశామని, అందుకే సందర్శించేందుకు వచ్చినట్లు తెలిపారు. నేటికీ పాఠశాల భవనం అసంపూర్తి నిర్మాణంగానే ఉందని, గ్రామంలో అంగన్ వాడి భవనం లేదన్నారు. రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించలేదన్నారు. ఒకసారి నమ్మి వైసీపీకి అధికారమిచ్చి మనమంతా మోసపోయామన్నారు. అంతే కాకుండా మనకు రక్షణగా ఉండాల్సిన చట్టాలు, హక్కులు కూడా కోల్పోయామన్నారు. నేటి పాలకుల అసమర్థత కారణంగా ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం వేరే కులాలను తీసుకొచ్చి ఎస్టీ జాబితాలో చేర్చి మన బతుకులు నాశనం చేయాలని చూస్తుందన్నారు. ఇటువంటి విపత్కర సమయాల్లో గిరిజనులు మేల్కోవాలన్నారు. కేవలం ఓట్ల కోసమో మిమ్మల్ని మభ్యపెట్టడానికి రాలేదని, వాస్తవ రాజకీయాలు పార్టీల మోసాలను మీకు వివరించి సమస్యలు ప్రభుత్వానికి తెలియజేయదానికే వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, జి.మాడుగుల మండల అధ్యక్షులు మాసడి భీమన్న, చింతపల్లి మండల అధ్యక్షులు వంతల బుజ్జిబాబు, గడుతూరి పరమేశ్వరావు, పొత్తురు విష్ణుమూర్తి, వనపల్ల ఈశ్వర్, రఘువంశి, కొయ్యం సిద్దు, స్వామి, సంతోష్, మత్స్యరాజు పాల్గొన్నారు.

వరిలో అధిక దిగుబడుల కొరకు యాజమాన్య పద్ధతులు

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్ : మండలంలో రామారాయుడుపాలెం, యలమంచిలి, కొత్తపాలెం గ్రామాల్లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ రమణమూర్తి ఆధ్వర్యంలో, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అనకాపల్లి తెగుళ్ళ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, ప్రాంతీయ కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఏబీయం శిరీష,డి ఆర్సి అనకాపల్లి అగ్రికల్చర్ ఆఫీసర్ విజేత, వ్యవసాయ ఉపసంచాలకులు రవి ప్రకాష్‌లు కలిసి బుధవారం నాడు వరి పొలాలను సందర్శించి వాటికి సంబంధించిన పలు సమస్యలను గుర్తించి తగిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అభ్యుదయ రైతులతో పాటుగా, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు ఏఈఓ దేవుడు, అరుణ, స్వాతి, పాలొతతతత్గ్నారు.

అరకు ఎంపీ మాధవి నిధులతో సమస్యల పరిష్కారానికి కృషి

గొందిపాకల ఎంపీటీసీ సభ్యుడు మోహన్ రావు

విశాలాంధ్ర - చింతపల్లి : మండలంలోని గొంది పాకల పంచాయతీలో నెలకొన్న రహదారి, త్రాగునీరు వంటి సమస్యలను అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి నిధులతో ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు తాంబేలి మోహన్ రావు అన్నారు. మండలంలోని గొందిపాకల పంచాయతీ రోలుగుంట గ్రామంలో పెద బరడ ఎంపీటీసీ సభ్యుడు పొట్టిక లోవరాజుతో కలిసి త్రాగునీటి బోర్ వెల్ నిర్మాణ పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో సమస్యలను ఎంపీ మాధవి దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించిన ఆమె పంచాయతీ పరిధిలో 10 లక్షలతో సిసి రోడ్డును, సమగిరి, తాడిపాలెం, రోలుగుంట, గొడుగుమామిడి గ్రామాల కు త్రాగునీరు బోరులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా సచివాలయం కన్వీనర్స్ పొటుకూరి బెన్నస్వామి, మాతే రాజుబాబు, వార్డ్ సభ్యుడు సోమరాజు, వైసిపి నాయకులు బొబ్బిలి చిన్న, గృహసారథి ఈశ్వర్ రావు గ్రామస్తులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - మాకవరపాలెం : మండలం తామరం హైస్కూల్లో ఉత్తరాంధ్ర కబడ్డీ పోటీలును ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రారంభించారు. దసరా నవరాత్రుల సందర్భంగా ఉత్తరాంధ్ర కబడ్డీ పోటీలను ఏర్పాటుచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు గంగిరెడ్ల నాయుడు తెలిపారు.ఈ పోటీల్లో 36 టీములు పాల్గొంటున్నట్లు ఆయన అన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి 16000 వేలు రెండవ బహుమతి 13000 వేలు మూడో బహుమతి 10000 నాలుగో బహుమతి 7000 గా అందజేస్తామని నాయుడు అన్నారు.